
సాక్షి ఒడిశా
మంగళవారం । 14 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,14,779లు, వెండి 62 గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



నాటు సారాతో వ్యక్తి అరెస్టు

అక్రమంగా నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని జయపురం ఎక్సైజ్ అధికారులు ఆదివారం అరెస్టు చేశారు.

- 8లో▸



సారా, మద్యం స్వాధీనం

ఎన్నికల్లో ఓటర్లను మభ్య పెట్టేందుకు సిద్ధం చేసిన మద్యం, సారాను ఎక్సైజ్ సిబ్బంది దాడులు చేసి స్వా. ధీనం చేసుకున్నారు.

- 8లో▸

తొలిదశ ప్రశాంతం

- రాష్ట్రంలో ముగిసిన తొలిదశ పోలింగ్
- సమగ్ర పోలింగ్ 63.85 శాతం
- నవరంగపూర్‌లో అత్యధిక పోలింగ్
- అత్యల్పంగా బరంపురంలో



రాయగడ: ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్న మహిళలు

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలిదశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బరంపురం, కలహండి, నవరంగ్‌పూర్, కొరాపుట్ లోక్‌సభ నియోజకవర్గాలు, వాటి అనుబంధ శాసనసభ నియోజకవర్గాల్లో సోమవారం పోలింగ్ పూర్తయ్యింది. అక్కడక్కడ స్వల్ప ఇబ్బందికర పరిస్థితులు మినహా పోలింగ్ ఆద్యంతం శాంతియుతంగా కొనసాగినట్లు అధికార వర్గాల సమాచారం.

పోలింగ్ సిబ్బంది సస్పెండ్

తొలిదశ ఎన్నికల పోలింగ్ కార్యకలాపాల నిర్వహణలో నిర్లక్ష్య వైఖరి ఆరోపణ కింద అనుబంధ సిబ్బందికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు పోలింగ్ అధికారులను సస్పెండ్ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నికుంజ్ బిహారీ ధొలా వెల్లడించారు. కలహండి లోక్‌సభ నియోజకవర్గం నౌర్లా శాసనసభ స్థానం పరిధిలో పోలింగ్ బూత్, గంజాం జిల్లా బరంపురం ప్రాంతంలో నియమించబడిన పోలింగ్ అధికారిని సస్పెండ్ చేశారు. అలాగే గంజాం జిల్లాలోని చికిటిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాజకీయ హింసాకాండ చోటు చేసుకుంది. దీంతో తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్లను ఆదేశించినట్లు సీఈవో తెలిపారు.

పటిష్ట భద్రత చర్యలు

ఒడిశాలోని 4 లోక్‌సభ (బరంపురం, కలహండి, నవరంగ్‌పూర్, కొరాపుట్), 28 అసెంబ్లీ స్థానాలకు కట్టుదిట్టమైన భద్రత మధ్య పోలింగ్ పూర్తి అయింది. బరంపురం లోక్‌సభ స్థానం పరిధిలోని ఛత్రపురం, గోపాల్‌పూర్, బరంపురం, దిగొపొహండి, చికిటి, మోహన, పర్లాఖెముండి పరిధిలోని 7 అసెంబ్లీ నియోజక వర్గాలు, కలహండి లోక్‌సభ స్థానం పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలు నువాపడా, ఖరియార్, లంజిగఢ్, జునాగఢ్, ధర్మగఢ్, భవానీపట్న, నౌర్లా, నవరంగ్‌పూర్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఉమర్‌కోట్, ఝొరిగాంవ్, నవరంగ్‌పూర్, డాబుగాంవ్, కోట్‌పాడ్, మల్కన్‌గిరి, చిత్రకొండ 7 అసెంబ్లీ నియోజక వర్గాలు, కొరాపుట్ లోక్ సభ నియోజక వర్గం పరిధిలోని గుణుపురం, బిసంకటక్, రాయగడ, లక్ష్మీపూర్, జయపురం, కొరాపుట్, పొట్టంగి 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ ముగిసింది. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో తొలి దశ ఎన్నికల్లో సమగ్రంగా 63.85 శాతం పోలింగు రికార్డు అయింది. నవరంగపూర్ లోక్‌సభ నియోజకవర్గంలో అత్యధికంగా 68.74 శాతం పోలింగ్ నమోదు కాగా, బరంపురం నియోజకవర్గంలో అతి తక్కువగా 58 శాతం పోలింగ్ జరిగింది. కలహండి పార్లమెంటరీ నియోజకవర్గంలో 67.07 శాతం, కొరాపుట్‌లో 61.43 శాతం పోలింగ్ జరిగింది. గంజాం, కలహండి, కొరాపుట్, మల్కన్‌గిరి, నవరంగపూర్, నువాపడా, రాయగడ జిల్లాల్లో తొలి దశ ఎన్నికలు జరిగాయి. అత్యధికంగా 71.02 శాతంతో నవరంగపూర్ జిల్లా ముందంజలో నిలిచింది. గంజాం జిల్లాలో అతి తక్కువగా 55.65 శాతం పోలింగు జరిగింది. కలహండి జిల్లాలో 67.37, కొరాపుట్‌లో 61.22, మల్కన్‌గిరి ప్రాంతంలో 65.88, నువాపడా జిల్లాలో 66.35, రాయగడలో 62.96 శాతం పోలింగు జరిగింది.

బరంపురం లోక్‌సభ పరిధిలో...



బరంపురం: గుసానినువాగంలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న మహిళలు



బరంపురం: ఓటుహక్కు వినియోగించుకున్న బీజేడీ ఎమ్మెల్యే అభ్యర్థి డా.రమేష్‌చావ్ పట్నాయక్



బరంపురం: ఓటు వేస్తున్న బీజేడీ అభ్యర్థి విక్రమ్ కుమార్ పండా



బరంపురం: అస్కా రోడ్‌లో పింక్ బూత్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా అధికారులు

బరంపురం: గంజాం జిల్లాలోని బరంపురం లోక్‌సభతో పాటు ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం జరిగిన పోలింగ్‌లో చెదురు మదురు ఘటనలు మినహాయించి ప్రశాంతంగా జరిగింది. ఐదు శాసనసభ నియోజకవర్గాలు బరంపురం, గోపాల్‌పూర్, ఛత్రపూర్, దిగపండి, చికిటిలో ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైంది. అయితే కొన్నిచోట్ల ఈవీఎం యంత్రాలు మొరాయించడంతో అలస్యంగా ప్రారంభమైంది. అభ్యర్థులంతా వారికి కేటాయించిన నియోజకవర్గాల్లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళలో ఎక్కువగా ఓటర్లు పోటెత్తారు.

మల్కన్‌గిరి జిల్లాలో...



మల్కన్‌గిరి: ఓటు వేసేందుకు తండ్రిని తీసుకొస్తున్న కుమార్తె



మల్కన్‌గిరి: ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ప్రజలు



మల్కన్‌గిరి: కుమ్మిటిగూడలో బారులుతీరిన మహిళలు

మల్కన్‌గిరి: జిల్లాలోని రెండు నియోజకవర్గాలు మల్కన్‌గిరి, చిత్రకొండలో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. కొన్ని బూత్‌లలో ఈవీఎంలు సరిగా పనిచేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. చిత్రకొండ నియోజకవర్గంలోని బోండఘట్టీ ముదిలిపోడలో బోండ మహిళలు తమ ఓటుహక్కును వినియోగించూకూన్నారు.

రాయగడ జిల్లాలో...



ఓటుహక్కు వినియోగించుకున్న కలెక్టర్ మహాజన్



రాయగడ: ఓటు వేస్తున్న అనసూయా మాఝి



రాయగడ: బారులుతీరిన ఓటర్లు

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్‌లో భాగంగా రాయగడ పట్టణంలోని అటానమస్ కళాశాల, గొపబంధు మున్సిపాలిటీ ఉన్నత పాఠశాల, కొల్లిగుడ ప్రాథమిక పాఠశాల, కాసీపూర్ సమితి నకటిగుడ ప్రాంతాల్లో ఓటింగ్ కొనసాగింది. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో సుమారు రెండు గంటల పాటు పోలింగ్ నిలిచిపోయింది. జిల్లాలోని బిసంకటక్ శాసనసభ నియోజకవర్గం పరిధి మామిడిగుడ, కొంధొ చంపియా గ్రామాల ప్రజలు తమ గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించలేదని ఎన్నికలను బహిష్కరించారు. అదేవిధంగా కల్యాణ సింగుపూర్ సమితి లకొపాదొర, పాటంగిపాదొరొ గ్రామాల్లోనూ ఎన్నికలు బహిష్కరించారు.

గజపతి జిల్లాలో...



పర్లాకిమిడి: ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు



పర్లాకిమిడి: కాశీనగర్ సమితి కె.సీతాపురం గ్రామంలో ఓటువేయడానికి వచ్చిన వృద్ధురాలు



పర్లాకిమిడి: ఓటు వేయడానికి బారులుతీరిన మహిళలు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని మోహనా (ఎస్టీ), పర్లాకిమిడి నియోజకవర్గాల్లో సోమవారం పోలింగ్ జరిగింది. ఒకటి, రెండు చెదురు మదురు ఘటనలు తప్ప పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కాశీనగర్ సమితి రాణిపేట గ్రామంలో వయోవృద్ధులు, మహిళలు ఓటుహక్కు వినియోగించుకోవడానికి బారులుతీరారు.

జయపురం సబ్ డివిజన్‌లో...



జయపురం: ఓటు వేసేందుకు బారులుతీరిన ప్రజలు



ఓటు వేస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి



జయపురం: లేబర్ జంక్షన్ వద్ద పోలింగ్ కేంద్రంలో వేచివున్న ఓటర్లు

జయపురం: జయపురం సబ్ డివిజన్‌లోని జయపురం(జనరల్), కోట్‌పాడ్(ఎస్టీ) నియోజకవర్గాల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఓటు వేసేందుకు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులుతీరారు. బూత్ బయట కూర్చున్న వృద్ధురాలిని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాహిణీపతి పోలింగ్ వరకు తీసుకొని వెళ్లారు. జయపురం పట్టణంలో ఏర్పాటు చేసిన 90 పోలింగ్ కేంద్రాల్లో 6 పింక్ బూత్‌లు తప్ప, మరే ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదు. కనీసం వయోవృద్ధులు కూర్చేనేందుకు అనేక పోలింగ్ కేంద్రాల్లో ఒక్క చైర్ కూడా లేదు. కనీసం తాగేందుకు నీరు ఏర్పాటు చేయలేదని ఓటర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

పోలింగ్ శాతాలు పరిశీలిస్తే...

పార్లమెంటరీ నియోజకవర్గాలు	పోలింగ్ శాతం
బరంపురం	58.00
కలహండి	67.07
నవరంగ్‌పూర్	68.74
కొరాపుట్	61.43
శాసనసభ నియోజకవర్గాలు	**పోలింగ్ శాతం**
బరంపురం	47.90
ఛత్రపురం	54.65
గోపాల్‌పూర్	56.65
దిగొపొహండి	59.20
చికిటి	54.65
మోహన	63.25
పర్లాఖెముండి	64.23
నువాపడా	66.22
ఖరియార్	66.48
లంజిగఢ్	63.38
జునాగఢ్	70.45
ధర్మగఢ్	70.06
భవానీపట్న	62.02
నౌర్లా	70.43
ఉమర్‌కోట్	69.40
ఝొరిగాంవ్	69.60
నవరంగ్‌పూర్	73.44
డాబుగాంవ్	71.30
కోట్‌పాడ్	65.67
మల్కన్‌గిరి	66.60
చిత్రకొండ	65.01
గుణుపురం	57.44
బిసంకటక్	67.99
రాయగడ	63.20
లక్ష్మీపూర్	58.66
జయపురం	66.58
కొరాపుట్	55.35
పొట్టంగి	58.50

న్యూస్‌రీల్

ఎంపీ అనుభవ్‌కు వ్యతిరేకంగా ఎన్‌బీడబ్ల్యూ జారీ

భువనేశ్వర్: కేంద్రాపడా ఎంపీ, చలన చిత్ర నటుడు అనుభవ్ మహంతికి వ్యతిరేకంగా కటక్ ప్రథమ శ్రేణి జుడిషియల్ మేజిస్ట్రేటు ప్రత్యేక కోర్టు (జేఎంఎఫ్‌సీ) బెయిలు రహిత అరెస్టు వారెంటు జారీ చేసింది. ఆయనకు వ్యతిరేకంగా పూరీ ఘాట్ ఠాణాలో వర్ష ప్రియదర్శి నమోదు చేసిన గృహ హింస వేధింపుల వ్యవహారంలో విచారణకు కోర్టు స్వీకరించింది. ఈ నేపథ్యంలో వివరణ నమోదు కోసం నిందిత ఎంపీ అనుభవ్ మహంతి ప్రత్యక్షంగా కోర్టులో హాజరు కావాలని వరుసగా రెండుసార్లు తాఖీదులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు ఆయన ప్రత్యక్షంగా హాజరు కాకపోవడంతో బెయిలు రహిత అరెస్టు వారెంటు (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేయడం అనివార్యమైనట్లు కోర్టు వర్గాల సమాచారం. వ్యక్తిగత కారణాలను చూపుతూ గతంలో తన లాయర్ ద్వారా కోర్టును ఆశ్రయించారు. ఈ నెల 23వ తేదీలోగా నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ అమలు చేయాలని ప్రత్యేక జేఎంఎఫ్‌సీ కోర్టు పూరీ ఘాట్ పోలీస్ స్టేషన్‌ను ఆదేశించింది.

పులి చర్మం స్వాధీనం



పులి చర్మంతో పట్టుబడిన నిందితులు

రాయగడ: జిల్లాలోని మునిగుడ అటవీ ప్రాంతంలో పులి చర్మాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆరుగురిని అటవీ శాఖ అధికారులు సోమవారం పట్టుకున్నారు. గతకొద్ది రొజులుగా ఈ రేంజ్‌లో పులి చర్మాల అక్రమ రవాణా జోరుగా కొనసాగుతున్నట్లు అందిన సమాచారం మేరకు జిల్లా అటవీ శాఖ అధికారి ఏర్పాటు చేసిన స్పెషల్ స్క్వాడ్ విస్తతంగా దాడులను నిర్వహిస్తోంది. జిల్లాలోని గుడారి అటవీ ప్రాంతంలో గత రెండు రొజుల క్రితం పులిచర్మం వ్యాపారలావాదేవీలకు సంబంధించి ఈ స్క్వాడ్ దాడులను నిర్వహించింది. పులిచర్మంతోపాటు ఐదుగురిని పట్టుకుని కోర్టుకు తరలించిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో అటవీ సిబ్బంది నిర్వహించిన దాడుల్లో మునిగుడలో మరో పులి చర్మం పట్టుబడటం విశేషం.

సామాన్యుడిలా..!



సామాన్యుడిలా లైన్‌లో నిల్చున్న కలెక్టర్ సచిన్ పవార్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ సచిన్ పవార్ తన ఓటు హక్కును కూమ్మిటిగూడ పాఠశాలలో సోమవారం గంట సమయం సామన్య పౌరిడిలా లైన్‌లో ఉండి ఓటు వేశారు సచిన్ పవార్ ప్రజాల్లో చైతన్యం తేవడం కోసమే ఇలా వచ్చి ఓటు వేశారు. ప్రతి ఓటర్ తన ఓటు హక్కును ఏలా వినియోగించుకూంటున్నారో స్వయంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి పరిశీలించారు.

ముగ్గురు ప్రిసైడింగ్ అధికారుల సస్పెన్షన్

- ఇద్దరిని అరెస్ట్ చేయాలని ఉత్తర్వులు: సీఈఓ



సీఈఓ నికుంజ బిహారి ధొలా

భువనేశ్వర్: రాష్ట్రంలో సోమవారం జరిగిన తొలి దశ ఎన్నికల నిర్వహణలో కొంతమంది అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించారని ఒడిశా ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) నికుంజ బిహారీ ధొలా తెలిపారు. పోలింగ్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు మూడు బూత్‌ల ప్రిసైడింగ్ అధికారులను సస్పెండ్ చేయాలని, వీరిలో ఇద్దరిని అరెస్టు చేయాలని గంజాం కలెక్టర్ దిబ్య జ్యోతి పరిదాను ఆదేశించారు. వారు విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి పాల్పడ్డారు. వీరిద్దరు ఛత్రపురం బూత్ నంబర్ 27, ఛత్రపురం పోలింగ్ స్టేషన్ నంబర్ 163లో నియమితులైన సిబ్బందిగా పేర్కొన్నారు. వారిని సస్పెండ్ చేయడంతో పాటు అరెస్టు కూడా చేస్తారు. గోపాల్‌పూర్ బూత్ నంబర్ 193 ప్రిసైడింగ్ అధికారిని సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు సీఈఓ తెలిపారు.

మామిడిగుడ గ్రామస్తుల ఎన్నికల బహిష్కరణ



ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న మామిడిగుడ గ్రామస్తులు

రాయగడ: బిసంకటక్ శాసనసభ నియోజకవర్గం పరిధి కొలనార సమితి గడ్డిశేశిఖాల్ పంచాయతీలోని మామిడిగుడ గ్రామస్తులు సోమవారం జరిగిన ఎన్నికలను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఒకవైపు సార్వత్రిక ఎన్నికలు కొనసాగుతుండగా.. మరోవైపు తమ మౌలిక సౌకర్యాలు తీర్చలేని నాయకులకు తగిన బుద్ధి చెప్పాలన్న ఉద్దేశంతో మామిడిగూడ గ్రామస్తులు గ్రామంలో ప్లకార్డులను పట్టుకొని ఆందోళనకు దిగారు. ఈ గ్రామంలో 90 కుటుంబాలకు చెందిన సుమారు 600 మందికిపైగా జనాభా నివాసముంటున్నారు. గత కొన్నాళ్లుగా తాగునీటి సమస్య వేధిస్తోందని, గ్రామానికి సరైన రహదారి లేదని, ఇందిరా అవాస్ గృహాలు అర్హులకు దక్కలేదని వాపోయారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులను పట్టుకొని బైఠాయించారు. రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక ప్రాతినిథ్యం వహిస్తున్న బిసంకటక్ శాసనసభ నియోజకవర్గం పరిధిలోని ఈ గ్రామంలో సార్వత్రిక ఎన్నికల రోజున గ్రామస్తులు ఈ ఆందోళన చేయడంతో ఒకవైపు అధికారులు మరోవైపు నాయకులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఎప్పటినుంచో గ్రామంలో సమస్యలు విలయతాండవం చేస్తున్నప్పటికీ ఏఒక్కరూ పట్టించుకోకపోవడంతో ఆందోళనకు దిగక తప్పలేదని గోపినాథ్ మినియాక, నాయుడు మినియాక, లోక్‌నాథ్ మినియాక, గీతా మినియాక తెలిపారు.

రథ చక్రాల తయారీ



కుండల తయారీకి దుంగలు చెక్కుతున్న మహరణ సేవకుడు

భువనేశ్వర్: జగన్నాథుని యాత్ర కోసం రథాల తయారీ పనులు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ పనులు చక్రాల తయారీతో ప్రారంభించడం విశేషం. ఏక కాలంలో 3 రథాల తయారీ పనులు చేపడతారు. ప్రతి రథం పనుల్ని వేర్వేరుగా ఒక్కో ప్రధాన మహరణ, భొయి వర్గం సేవకులు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. వీరి ప్రత్యక్ష పర్యవేక్షణలో తొలి రెండు రోజుల్లో 3 రథాల చక్రాలకు 5 మధ్య భాగాలు (కుండలు) చెక్కడం పూర్తి చేశారు. బలభద్ర స్వామి రథం తాళ ధ్వజానికి 2, దేవీ సుభద్ర రథం దర్ప దళనం కోసం 1, జగన్నాథుని నందిఘోష్ రథానికి 2 కుండలు సిద్ధం చేశారు. తొలి రోజున వీటికి అవసరమైన దుంగల్ని చెక్కి సిద్ధం చేశారు. ఈ క్రమంలో 3 రథాలకు సమగ్రంగా 42 కుండలు తయారు చేస్తారు. తయారీ పనులు పుంజుకుంటున్న కొద్ది మొపరులు, వడ్రంగి కార్మికుల నియామకం అంచెలంచెలుగా పెంచుతారు. తొలి రోజున 26 మంది కార్మికులు పని చేయగా రెండో రోజు నాటికి ఈ సంఖ్యని 45కి పెంచారు. వీరిలో 22 మంది మహరణ, 12 మంది భొయి, 4 మంది రంపం, 6 మంది కమ్మరి కార్మికులతో ఒక సహాయకుడు ఉన్నారు. మరోవైపు కమ్మరి (ఓర్ఘా) పనులు ప్రారంభించారు. వీటి కోసం ఊంజల మండపం ప్రాంగణంలో ప్రత్యేకంగా కమ్మరి శాల ఏర్పాటు చేశారు. ఈ ప్రాంగణంలో కమ్మరి కొలిమి అగ్ని ప్రతిష్ట చేసి తొలుత చాయ మేకు (ఒరొ కొంటా) తయారు చేయడంతో కమ్మరి పనులకు శ్రీకారం చుట్టారు.



రథాల కోసం సిద్ధమైన కుండలు



చాయ మేకు (ఒరొ కొంటా) తయారీలో కమ్మరి సేవకుడు

క్లుప్తంగా

ఓయూహెచ్ఎస్ వీసీగా మానస్ రంజన్ సాహు



భువనేశ్వర్: ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (ఓయూహెచ్ఎస్) వైస్-చాన్సలర్‌గా ప్రొఫెసర్ డాక్టర్ మానస్ రంజన్ సాహూ నియమితులయ్యారు. రాష్ట్ర గవర్నర్, చాన్సలర్ రఘుబర్ దాస్ ఆమోదం మేరకు ఈ నియామకం జరిగినట్లు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రెండో విడతలో.. 30 శాతం మందిపై క్రిమినల్ కేసులు

భువనేశ్వర్: రాష్ట్రంలో రెండో విడత జంట ఎన్నికలు ఈ నెల 20న జరగనున్నాయి. ఈ విడతలో 5 లోక్ సభ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో 30 శాతం మంది వ్యతిరేకంగా క్రిమినల్ కేసులున్నట్లు ఒడిశా ఎలక్షన్ వాచ్, ప్రజాస్వామ్య సంస్కరణ సంఘం (ఏడీఆర్) విశ్లేషణలో వెల్లడైంది. అసికా, బర్‌గఢ్, బొలంగీర్, కంధమల్, సుందర్‌గడ్ నియోజకవర్గాల్లో అభ్యర్థులు దాఖలు చేసిన స్వీయ ప్రమాణ పత్రాల ఆధారంగా ఈ విశ్లేషణ జరిగింది. ఈ నియోజక వర్గాల్లో సమగ్రంగా 40 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరిలో 12 (30 శాతం) మంది అభ్యర్థులు తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు. 8 (20 శాతం) మంది అభ్యర్థులు తమపై తీవ్రమైన క్రిమినల్ కేసులను ప్రకటించగా, ఒక అభ్యర్థి తనపై హత్యకు సంబంధించిన కేసు ఉన్నట్లు ప్రకటించారు. అదేవిధంగా, 4 మంది అభ్యర్థులు తమపై హత్యాయత్నం (ఐపీసీ సెక్షన్ 307) కేసులు ఉన్నట్లు నామినేషను దస్తావేజులతో దాఖలు చేసిన అఫిడవిటులో పేర్కొన్నారు. మరో 4 మంది అభ్యర్థులపై మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. పార్టీల వారీగా విశ్లేషిస్తే బీజేపీలో అత్యధికంగా 80 శాతం మంది అభ్యర్థులు వ్యతిరేకంగా క్రిమినల్ కేసులున్నట్లు ఈ నివేదిక వెల్లడించింది. కాంగ్రెస్, బీజేడీ నుంచి చెరో 20 శాతం చొప్పున మంది అభ్యర్థుల వ్యతిరేకంగా క్రిమినల్ కేసులున్నట్లు తేలింది. రాష్ట్రంలో సోమవారం ముగిసిన మొదటి దశ లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసిన 37 మంది అభ్యర్థుల్లో ఏడు (19 శాతం) మంది తమపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయ ని ఒడిశా ఎలక్షన్ వాచ్, ఏడీఆర్ విశ్లేషణ వెల్లడించింది.

నాటు సారాతో వ్యక్తి అరెస్టు



సారాతో పట్టుబడిన ఘాశీ, పోలీసు సిబ్బంది

జయపురం: అక్రమంగా నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని జయపురం అబ్కారిశాఖ అధికారులు ఆదివారం అరెస్టు చేశారు. పట్టుబడిన వ్యక్తి జయపురం సమితి బలియ పంచాయతీ నీలాగుడ గ్రామానికి చెందిన ఘాశీ దువారుగా గుర్తించారు. అతని వద్ద నుంచి సారాతోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని జయపురం అబ్కారిశాఖ అధికారి శశికాంత దత్ వెల్లడించారు. ఆదివారం మధ్యాహ్నం తమ సిబ్బంది పెట్రోలింగ్‌లో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా.. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తి వాహనాన్ని తనిఖీ చేయగా సారాప్యాకెట్లు బయటపడినట్టు వెల్లడించారు. ఘాశీపై కేసు నమోదు చేసి కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. వాహనాల తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్‌దొలాయ్ ఉన్నారు.

నైటింగేల్‌కు ఘనంగా నివాళి



అతిథులను మెమెంటోలతో సత్కరించిన భొత్ర

జయపురం: ప్రముఖ సమాజ సేవకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని ఆదివారం సాయంత్రం స్థానిక ఫ్లోరెన్స్ నైటింగేల్ ఏఎన్ఎమ్ శిక్షణ కేంద్రంలో ఘనంగా జరిపారు. శిక్షణ కేంద్ర డైరెక్టర్ గౌరవ భొత్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కేంద్ర ఆస్పత్రి మేనేజర్ రూపసీ మధుమతి నాయిక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నైటింగేల్ పృధ్విలో నిస్సహాయకులకు, క్షతగాత్రులకు అందించిన సేవలను వివరించారు. ఆమె సమాజ సేవకు ప్రతీక అన్నారు. నర్సులు నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకొని రోగులకు ఉచిత సేవలు అందించాలని ఉద్బోధించారు. ముందుగా అతిథులు నైటింగేల్ చిత్రపటానికి కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. శిక్షణ కేంద్రం మాజీ ప్రిన్సిపాల్ నజరిత కోశ్ల ముఖ్యవక్తగా పాల్గొని నైటింగేల్ సేవా ప్రవృత్తిని వివరించారు. గౌరవ అతిథిగా సమాజ సేవకురాలు మమతా బెహర, శౌభాగిని నందో, గ్రోసియస్ టకిరీ, అంజళీ బెహర, సెలబ శౌళీ నాయక్, మౌసమీ నాయక్, అభిమన్య బెనియ, పాత్రికేయుడు సురేష్ కుమార్ నాయుడు పాల్గొన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా మహిళా అతిథులకు కేంద్రం డైరెక్టర్ భొత్ర జ్ఞాపికలను అందించి గౌరవించారు.

వర్ష బీభత్సం

- విరిగిపడిన చెట్లు
- ప్రజలు అవస్థలు



నందపూర్‌లో రోడ్డుపై పడిన చెట్లను తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: అకాల వర్షం కొరాపుట్ జిల్లాలోని పలు గ్రామాల్లో వర్షం బీభత్సం సృష్టించింది. సునాబెడ, సెమిలిగుడ, ధమంజోడి, లమతాపుట్, నందపూర్ ఆదివారం సాయంత్రం భారీ గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఎక్కడికక్కడ చెట్లు విరిగిపడ్డాయి. జనజీవనం స్తంభించింది. సునాబెడ-3 కాలీ జొడాగుడ కూడలిలోని పాఠశాలపై పెద్ద చెట్టు విరిగి పడింది. అలాగే ధమంజోడిలో భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సుమారు అరగంటపాటు గాలులు, వర్షాలు కారణంగా టంగినపొదర్, మతలాపుట్, నల్కో తదితర చోట్ల చెట్లు నేలకూలాయి. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలపై చెట్లు విరిగిపడడంతో సరఫరాకు అంతరాయం కలిగింది. నందపూర్ కమ్యూనిటీ ఆస్పత్రి ప్రాంతంలో పెద్ద చెట్టు విరిగి రోడ్డుపై పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నందపూర్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని చెట్లను తొలగించారు. సెమిలిగూడలో కూడా భారీ వర్షం కురవడంతో భారీ వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి.



ధమంజోడి ప్రాంతంలో విరిగి పడిన చెట్టు



సెమిలిగూడలో రోడ్లపై పారుతున్న వర్షపు నీరు



సునాబెడలో పాఠశాలపై విరిగి పడిన చెట్టు



పూరీ సముద్ర తీరంలో మీ ఓటు.. మీ భవిష్యత్తు అని అవగాహన కల్పిస్తూ సైకత శిల్పం రూపుదిద్దుకుంది. రాష్ట్రంలో తొలి దశ ఎన్నికల పోలింగ్ పురస్కరించుకుని అంతర్జాతీయ సైకత శిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ సోమవారం సైకత శిల్పం ఆవిష్కరించాడు. దీని రూప కల్పనలో రెండు వేల బంతులు, చిన్న గిన్నెలు ఉపయోగించినట్లు పేర్కొన్నాడు. 100 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పు ఉన్న ఈ సువిశాల సైకత శిల్పం సందర్శకుల్ని విశేషంగా ఆకట్టుకుంటుంది.
- భువనేశ్వర్/పూరీ

సారా, మద్యం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న విదేశీ మద్యం బాటిళ్లు, సారా ప్యాకెట్లు

బరంపురం: ఎన్నికల్లో ఓటర్లను మభ్య పెట్టేందుకు సిద్ధం చేసిన మద్యం, సారాను ఎక్సైజ్ సిబ్బంది దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో తొలివిడత ఎన్నికల నేపథ్యంలో ఆదివారం బరంపురం-ఛత్రపూర్ మధ్య రహదారి మధ్య గ్రామంలో అర్ధరాత్రి అబ్కారిశాఖ సిబ్బంది దాడులు చేశారు. దాడుల్లో విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని వాహన డ్రైవర్‌ని అరెస్టు చేసినట్టు అబ్కారీ అధికారి గీతంజలి సాహు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి చమ్మఖండి పోలీసు స్టేషన్ పరిధిలోని బొనుగునాపల్లి గ్రామంలో ఒక కారులో అక్రమంగా విదేశీ మద్యం బాటిళ్లను తరలిస్తున్న సమయంలో జిల్లా ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి వెయ్యి సారా ప్యాకెట్లు, 68.400 లీటర్ల విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కారుని సీజ్ చేసి.. డ్రైవర్ సీహెచ్ మాణిక్ కుమార్‌ని అరెస్టు చేశారు.



పట్టుబడిన విదేశీ మద్యం బాటిళ్లు

అంధవరంలో దాడి

జలుమూరు: మండలంలోని అంధవరం పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సవలాపురం రాముపై అదే గ్రామానికి చెందిన పల్లి శంకరరావు, తిరుమలరావులు దాడికి పాల్పడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓట్లు పడటంతో ఓర్వలేని టీడీపీ వర్గీయులు రెచ్చకొట్టే మాటలు ఆడుతూ ఓటు వేసి వచ్చిన రామును నేలపై దొర్లించి రాయితో కంటి కింద గాయం చేశారు. స్థానిక వైద్యసిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మధుసూదన రావు సిబ్బందితో వెళ్లి పరిస్థితి సద్దుమణిగించారు.

ఓటేసిన కొద్ది సేపటికే మృత్యువాత



సత్యం మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య చంద్రమ్మ

డెంకాడ: అంతవరకు బాగానే ఉన్నాడు. భార్యతో కలిసి ఓటు వేసి ఇంటికి వచ్చిన కాసేపటికి ఆ వృద్ధుడు మరణించాడు. ఈ విచారకర సంఘటన మండలంలోని డెంకాడ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. డెంకాడ గ్రామానికి చెందిన కోయనేని సత్యం (85) భార్య చంద్రమ్మతో కలిసి పోలింగ్ బూత్‌కి వెళ్లి ఓటు వేసి తిరిగి ఇంటికి చేరుకున్నాడు. అక్కడకు కొద్దిసేపటి తర్వాత కన్నుమూశాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు



ఈవీఎంలు భద్రపరిచే తీరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



లెండీ ఇంజినీరింగ్ కళాశాల లోపలికి ఈవీఎంలను తీసుకెళ్తున్న సిబ్బంది

విజయనగరం అర్బన్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ముగిసింది. ఇప్పటికే కేటాయించిన రిసెప్షన్ సెంటర్లకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన 1,874 పోలింగ్ కేంద్రాల ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లను తరలిస్తున్నారు. డెంకాడ మండలం లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్.కోట, నెల్లిమర్ల, గజపతినగరం, చీపురుపల్లి, రాజాం నియోజకవర్గాల ఈవీఎంలు, జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీ ప్రాంగణంలోని స్ట్రాంగ్‌రూమ్‌లో విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల ఈవీఎంలు భద్రపరుస్తున్నారు.

కొత్తూరులో ఈదురుగాలుల బీభత్సం

- పోలింగ్ స్టేషన్ల వద్ద ఎగిరిపోయిన టెంట్లు

కొత్తూరు : సార్వత్రిక ఎన్నికల వేళ కొత్తూరులో సోమవారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల ధాటికి పోలింగ్ స్టేషన్ల వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు నేలకొరిగాయి. పలుచోట్లు చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో పోలింగ్ స్టేషన్ల వద్ద జనరేటర్లను సిద్ధం చేశారు. అవి కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. రాత్రి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పలు గ్రామాలు అంధకారం అలముకుంది. విద్యుత్ సరఫర నిలిచిపోవడంతో పోలంగ్ స్టేషన్ వద్ద జనరేటర్లు సక్రమంగ పనిచేయక పోవడంతో పోలింగ్ సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. కొత్తూరు, మెట్టూరులతో పాటు పలు గ్రామాల్లో గంటల తరబడి ఈవీఎంలు మొరాయించాయి. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కొత్తూరుతో పాటు పలు పోలింగ్ స్టేషన్‌లను అడిషనల్ ఎస్పీ ప్రేమ్‌కాజల్ సందర్శించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

అధికారుల అత్యుత్సాహం.. కూటమికి సహకారం

రణస్థలం: మండలంలోని రెండు చోట్ల బీజేపీ, టీడీపీకి అనుకూలంగా ఎన్నికల అధికారులు అత్యుత్సాహం చూపించారు. ఈ విషయమై బంటుపల్లి, గిరివానిపాలెం బూత్ ఏజెంట్లు ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్వీ లక్ష్మణమూర్తికి ఫిర్యాదులు చేశారు. గిరివానిపాలెం 142 పోలింగ్ కేంద్రంలో ఎన్నికల పోలింగ్ అధికారి ఎస్.తిరుపతిరావు బీజేపీ, టీడీపీకి అనుకూలంగా వ్యవహరించారని, వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసిన సమయంలో వాళ్లకి సహాయంగా వచ్చిన వారిని ఈవీఎంల వద్దకు పంపకుండా నేరుగా వెళ్లి ఓట్లు వేశారని బూత్ ఏజెంట్లు ఆరోపించారు. ఇలోగా ఇప్పిలి చిన్న అనే వృద్ధుడు ఓటు తన కుమార్తె సమాయంతో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చాడు. బూత్ ఏజెంట్లు పరిశీలించి ఓటు వేయడానికి ఈవీఎంల దగ్గరకు వెళ్లినప్పుడు పీఓ కూడా వెళ్లారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని వృద్ధుడు చెప్పగా పీవో సైకిల్‌పై బటన్ నొక్కడం, ఇది గమనించిన అతని కుమార్తె ఎందుకిలా చేశారని నిలదీశారు. దీంతో గందరగోళం ఏర్పడింది. ఇలా అప్పటికే యాభై పైచిలుకు ఓట్లు వేశారని బూత్ ఏజెంట్లు ఆరోపించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎల్.రామారావు పోలింగ్ కేంద్రానికి వచ్చి వివాదం సద్దుమణించారు. బూత్ ఏజెంట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్వో కార్యాలయానికి పీవో తిరుపతిరావును సరెండర్ చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా పీవోపై చర్యలు తీసుకుంటామని ఆర్వో లక్ష్మణమూర్తి తెలిపారు. బంటుపల్లి పోలింగ్ కేంద్రం 185, 186లో ఇజ్జు దుర్గా ప్రసాద్ రెండుసార్లు ఓట్లు వేయడంపై అభ్యంతరం తెలుపుతున్నా వీఆర్వో చిన్నారావు నేరుగా ఓటు వేయించారని బూత్ ఏజెంట్లు ఆర్వోకు ఫిర్యాదు చేశారు.

20న పైడితల్లి దేవర మహోత్సవం

- 21 నుంచి చదురుగుడిలో పైడితల్లి దర్శనం
- చాటింపు వేసిన ఆలయ తలయారులు



ప్రత్యేక అలంకరణలో ఉన్న పైడితల్లి అమ్మవారు



ఆలయ ఆవరణలో చాటింపు ప్రక్రియలో పాల్గొన్న ఆలయ పూజారులు, భక్తులు



కోటవద్ద చాటింపు వేస్తున్న తలయారులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి దేవర మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తలయారులు సోమవారం చాటింపు వేశారు. ప్రతి ఏటా వైశాఖ మాసంలో ఉత్సవ చాటింపు ప్రక్రియను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ మేరకు స్థానిక మూడు లాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ తలయారులు డప్పు వాయిద్యాలతో అమ్మవారికి మనవి చెప్పారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో దేవర మహోత్సవం చాటింపు వేశారు. అలాగే చిన పైడిరాజు బృందం డప్పులతో ఆలయంలోను, కోట వద్దనున్న కోటశక్తి అమ్మవారికి మనవి చెప్పారు. అనంతరం ఈఓ ప్రసాదరావు మాట్లాడుతూ.. ఈ నెల 20న సోమవారం సాయంత్రం 4 గంటలకు రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. అక్కడ నుంచి బాజా,భజంత్రీలు, మేళతాళాలతో అమ్మవారిని రైల్వేస్టేషన్ నుంచి గాడీఖానా, సీఎంఆర్ జంక్షన్, ఎన్‌సీఎస్ రోడ్డు, కన్యకపరమేశ్వరి ఆలయం, న్యూపూర్ణ జంక్షన్ మీదుగా హుకుంపేటలో ఉన్న పూజారి ఇంటివద్దకు తీసుకువెళ్తారన్నారు. అక్కడ అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాత్రి 12 గంటలు దాటిన తర్వాత మేళతాళాల నడుమ శివాలయం మీదుగా పెద్దచెరువు పశ్చిమభాగానికి చేరుకుని అక్కడ పెద్దచెరువులో పూజలు నిర్వహిస్తామని తెలిపారు. అక్కడ నుంచి వేకువజామున అమ్మవారిని మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడికి తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారన్నారు. మంగళవారం వేకువజామున 6 గంటల నుంచి అమ్మవారు ఆరు నెలల పాటు చదురుగుడిలోనే భక్తులకు దర్శనమిస్తారన్నారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించి, తరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, సూపర్‌వైజర్ ఏడుకొండలు, పైడిమాంబ కళాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



చదురుగుడిలో అమ్మవారికి డప్పు వాయిద్యాలతో మనవి చెబుతున్న చినపైడిరాజు బృందం

క్లుప్తంగా

అధికారుల అత్యుత్సాహం.. కూటమికి సహకారం


గిరివానిపాలెంలో పోలింగ్ అధికారి తిరుపతిరావు

రణస్థలం: మండలంలోని రెండు చోట్ల బీజేపీ, టీడీపీకి అనుకూలంగా ఎన్నికల అధికారులు అత్యుత్సాహం చూపించారు. ఈ విషయమై బంటుపల్లి, గిరివానిపాలెం బూత్ ఏజెంట్లు ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్వీ లక్ష్మణమూర్తికి ఫిర్యాదులు చేశారు. గిరివానిపాలెం 142 పోలింగ్ కేంద్రంలో ఎన్నికల పోలింగ్ అధికారి ఎస్.తిరుపతిరావు బీజేపీ, టీడీపీకి అనుకూలంగా వ్యవహరించారని, వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసిన సమయంలో వారికి సహాయంగా వచ్చిన వారిని ఈవీఎంల వద్దకు పంపకుండా నేరుగా వెళ్లి ఓట్లు వేశారని బూత్ ఏజెంట్లు ఆరోపించారు. ఈలోగా ఇప్పిలి చిన్న అనే వృద్ధుడు తన కుమార్తె సహాయంతో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చాడు. బూత్ ఏజెంట్లు పరిశీలించి ఓటు వేయడానికి ఈవీఎంల దగ్గరకు వెళ్లినప్పుడు పీఓ కూడా వెళ్లారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని వృద్ధుడు చెప్పగా పీవో సైకిల్‌పై బటన్ నొక్కడంతో ఇది గమనించిన అతని కుమార్తె ఎందుకిలా చేశారని నిలదీశారు. దీంతో గందరగోళం ఏర్పడింది. ఇలా అప్పటికే యాభై పైచిలుకు ఓట్లు వేశారని బూత్ ఏజెంట్లు ఆరోపించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎల్.రామారావు పోలింగ్ కేంద్రానికి వచ్చి వివాదం సద్దుమణించారు. బూత్ ఏజెంట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్వో కార్యాలయానికి పీవో తిరుపతిరావును సరెండర్ చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా పీవోపై చర్యలు తీసుకుంటామని ఆర్వో లక్ష్మణమూర్తి తెలిపారు. బంటుపల్లి పోలింగ్ కేంద్రం 185, 186లో ఇజ్జు దుర్గా ప్రసాద్ రెండుసార్లు ఓట్లు వేయడంపై అభ్యంతరం తెలుపుతున్నా వీఆర్వో చిన్నారావు నేరుగా ఓటు వేయించారని బూత్ ఏజెంట్లు ఆర్వోకు ఫిర్యాదు చేశారు.

కొత్తూరులో ఈదురుగాలుల బీభత్సం


- పోలింగ్ స్టేషన్ల వద్ద ఎగిరిపోయిన టెంట్లు
- నిలిచిన విద్యుత్ సరఫరా


గూనభద్ర అపోజిట్ ఆర్ఆర్ కాలనీ పోలింగ్ బూత్ వద్ద ఎగిరిన టెంట్లు

కొత్తూరు : సార్వత్రిక ఎన్నికల వేళ కొత్తూరులో సోమవారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల ధాటికి పోలింగ్ స్టేషన్ల వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు నేలకొరిగాయి. పలుచోట్లు చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో పోలింగ్ స్టేషన్ల వద్ద జనరేటర్లను సిద్ధం చేశారు. అవి కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. రాత్రి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పలు గ్రామాలు అంధకారం అలముకుంది. విద్యుత్ సరఫర నిలిచిపోవడంతో పోలంగ్ స్టేషన్ వద్ద జనరేటర్లు సక్రమంగ పని చేయక పోవడంతో పోలింగ్ సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. కొత్తూరు, మెట్టూరులతో పాటు పలు గ్రామాల్లో గంటల తరబడి ఈవీఎంలు మొరాయించాయి. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కొత్తూరుతో పాటు పలు పోలింగ్‌స్టేషన్‌లను అడిషనల్ ఎస్పీ ప్రేమ్‌కాజల్ సందర్శించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘించిన టీడీపీ నేతలు

- పోలింగ్ కేంద్రాల వద్ద ఎంపీ అభ్యర్థి రామ్మోహన్‌నాయుడు హడావిడి
- సెల్‌ఫోన్లతో అనుచరుల ఓవరాక్షన్


గుజరాతీపేట పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లతో రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం పార్లమెంట్ కూటమి అభ్యర్థి కె.రామ్మోహన్‌నాయుడు హడావిడి చేశారు. క్యూలైన్లలో ఉన్న ఓటర్లను ప్రలోభపెట్టేలా ఓటు వేయకముందే వారితో ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ప్రలోభపెట్టారు. తమ సిబ్బందితో ఫోటోలు దిగిన వారి వాట్సాప్ నంబర్లను తీసుకున్నారు. ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాలకు సెల్‌ఫోన్ల అనుమతి లేదని స్వయంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్పష్టంచేసిన విషయం తెలిసిందే. అయితేనా రామ్మోహన్‌తోపాటు అనుచరులంతా సెల్‌ఫోన్లలో పోలింగ్ కేంద్రాల వద్ద హంగామా సృష్టించడం విమర్శలకు తావిచ్చింది. స్థానిక టీడీపీ నాయకులు కూడా ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా ఉల్లింఘించారు. గుజరాతీపేటలోని వరం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ కేంద్రం వద్ద టీడీపీ నేతాలు ఓటర్లకు ప్రలోభపెట్టారు. ప్రధాన గేట్ వద్ద సైకిల్‌కు ఓటు వేయాలంటూ వరం కుమారులు, స్థానిక టీడీపీ నాయకులు చేసిన రచ్చ చేశారు. దీంతో ప్రత్యేక బెటాలియన్‌తోపాటు ఎస్పీ జీఆర్ రాధిక కూడా పోలింగ్ కేంద్రానికి చేరుకుని శాంతిభద్రతలను స్వయంగా పర్యవేక్షించారు. స్థానిక నాయకులను అక్కడ నుంచి పంపించివేశారు.

ఓటేసిన ప్రముఖులు

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోటెత్తారు. ప్రముఖులు సైతం ఉదయాన్నే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సమీప పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. – సాక్షి నెట్‌వర్క్


శ్రీకాకుళం రూరల్: పెదపాడులో ఓటు వేసిన శ్రీకాకుళం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు


ఆమదాలవలస: తొగరాంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఆమదాలవలస ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం దంపతులు


టెక్కలి: టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్


నందిగాం: కణితూరులో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ దంపతులు


పాతపట్నం: అచ్యుతాపురంలో ఓటు వేసిన పాతపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డి శాంతి, కుటుంబ సభ్యులు


పోలాకి: మబగాంలో ఓటు హక్కు వినియోగించుకున్న నరసన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్, కుటుంబ సభ్యులు


వజ్రపుకొత్తూరు: దేవునల్తాడలో ఓటు హక్కు వినియోగించుకున్న పలాస ఎమ్మెల్యే అభ్యర్థి సీదిరి అప్పలరాజు, శ్రీదేవి దంపతులు


సోంపేట: ఓటుహక్కు వినియోగించుకున్న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, కుటుంబ సభ్యులు


రణస్థలం: పాతర్లపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే అభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్

రెచ్చిపోయిన పచ్చమూకలు

- గోకర్నపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడి
- రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులు


రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

పొందూరు: ఎన్నికల వేళ టీడీపీ నాయకులు దౌర్జన్యాలకు దిగారు. వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులకు పాల్పడ్డారు. పొందూరు మండలం గోకర్నపల్లిలో పోలింగ్ ప్రారంభమైన కాసేపటికే కొట్లాట జరగడంతో 15 నిమిషాల పాటు ఓటింగ్ నిలిచిపోయింది. పోలింగ్ బూత్‌లో ఏజెంట్ల మధ్య తలెత్తిన వివాదం టీడీపీ, వైఎస్సార్‌సీసీ మధ్య కొట్లాటకు దారితీసింది. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతాడ జీవరత్నం, యతేంద్ర, సంపతిరావు సూర్యనారాయణలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఇరుపార్టీల నాయకులను అదుపులోకి తీసుకున్నారు. క్షతగాత్రులను శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం సతీమణి వాణి గోకర్నపల్లి గ్రామానికి చేరుకుని ఆర్‌ఓ నవీన్ కుమార్‌తో మాట్లాడారు. ఎస్పీ జీఆర్ రాధిక కూడా గోకర్నపల్లితో పాటు పలు గ్రామాలను సందర్శించారు. పిల్లలవలస, లోలుగు, బురిడికంచరాం, కింతలి, తొలాపి తదితర గ్రామాల్లోనూ స్వల్ప వివాదాలు, తోపులాటలు జరిగాయి.


గోకర్నపల్లిలో సర్పంచ్ చింతాడ మాధురి, బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న జేసీ నవీన్

అంధవరంలో దాడి


గాయపడిన రాము

జలుమూరు: మండలంలోని అంధవరం పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సవలాపురం రాముపై అదే గ్రామానికి చెందిన పల్లి శంకరరావు, తిరుమలరావులు దాడికి పాల్పడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓట్లు పడటంతో ఓర్వలేని టీడీపీ వర్గీయులు రెచ్చకొట్టే మాటలు ఆడుతూ ఓటు వేసి వచ్చిన రామును నేలపై దొర్లించి రాయితో కంటి కింద గాయం చేశారు. స్థానిక వైద్యసిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మధుసూదనరావు సిబ్బందితో వెళ్లి పరిస్థితి సద్దుమణిగించారు.

టీడీపీ నేతల 'విష' ప్రయోగం


చనిపోయిన రొయ్యలు

పోలాకి: మండలంలోని బెలమర గ్రామానికి చెందిన చింతు అప్పన్న అనే ఆక్వా రైతుకు చెందిన రొయ్యల చెరువుల్లో గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేశారు. దీంతో రొయ్యిలన్నీ చనిపోయాయి. బాధితుడు పోలాకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు కావడంతో ఎన్నికల నుంచి డైవర్ట్ చేసే ప్రయత్నంగా దుండగులు ఈ చర్యకు పాల్పడినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీనిపై ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ స్పందించారు. ఇలాంటి చర్యలను ఖండిస్తున్నామని చెప్పారు.

పలాసలో వైఎస్సార్‌సీపీ నేతల నిరసన..


టీడీపీ నేతలను పోలింగ్ బూత్ నుంచి బయటకు పంపాలని సీఐ కాళ్లు పట్టుకుంటున్న బడగల బల్లయ్య

కాశీబుగ్గ : పలాస పురుషోత్తపురం హైస్కూల్ వద్ద పోలింగ్ బూత్ వద్దకు టీడీపీ నాయకులను ఇష్టారాజ్యంగా విడిచిపెడుతున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు నిరసన వ్యక్తంచేశారు. ఏజెంట్ల పేరుతో గది నిండా టీడీపీ నాయకులు చేరడంతో పోలీసులను నిలదీశారు. అప్పటికీ తీరు మారకపోవడంతో రోడ్డుపై బైఠాయించారు. టీడీపీ నాయకుడు సప్ప నవీన్‌ను బయటకు పంపాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు బడగల బల్లయ్యనాయుడు, జోగి సతీష్ తదితరులు నిరసన వ్యక్తం చేశారు. టీడీపీకి కొమ్ము కాయడం తగదని చెప్పారు. దీంతో పోలీసులు నాయకులను చెదరగొట్టారు.


టీడీపీ తీరుకు నిరసనగా పలాస హైస్కూల్ ముందు బైఠాయించిన వైఎస్సార్ సీపీ నాయకులు

గొడవకు దిగిన కూటమి నేతలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తేలుకుంచి పోలింగ్ బూత్ వద్ద స్థానిక టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బెందాళం ఎదుట టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు వైస్సార్‌సీపీ నాయకులతో బాహాబాహీకి దిగారు. అంతలో అక్కడకు వచ్చిన పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర యాదవ్ ఇరువర్గాలతో మాట్లాడి పరిస్థితి సద్దుమణిగించారు.


ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచిలో ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్ ఎదుట వైఎస్సార్ సీపీ నాయకులతో బాహాబాహీకి దిగుతున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు

పలాసలో ఉద్రిక్తత


పోలింగ్ ప్రాంతం నుంచి వ్యక్తిని బయటకు పంపిస్తున్న పోలీసులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పలాస హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎక్కువ సంఖ్యలో టీడీపీ నాయకులు చేరుకుని ఓటర్లకు ఇబ్బందులకు గురిచేశారు. పోలింగ్ మిషన్ల వద్దకు వెళ్లనీయకుండా అలజడి సృష్టించారు. ఒకానొక సమయంలో తోపులాట చేసుకోవడంతో పోలీసు ఉన్నతాధికారులు చర్యలకు దిగారు. బీఎస్ఎఫ్ బెటాలియన్, ఆర్‌పీఎఫ్ కమాండర్ ఎం.చోహన్‌తో పాటు పోలీసులు ఇరుపక్షాలను చెదరగొట్టారు. రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు సందీప్ కుమార్ స్వయంగా పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు.


పలాస హైస్కూల్ వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎన్నికల రాష్ట్ర పరిశీలకుడు సందీప్‌కుమార్

మహిళపై టీడీపీ ఏజెంట్ల దౌర్జన్యం


టెక్కలిలో వైఎస్సార్‌సీపీ మహిళా ఏజెంట్ భువనేశ్వరిపై దౌర్జన్యానికి పాల్పడుతున్న టీడీపీ ఏజెంట్ ప్రీతీష్, మద్దతుదారులు

టెక్కలి: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో 113,114 పోలింగ్ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ఏజంట్ రెయ్యి భువనేశ్వరిపై టీడీపీ ఏజంట్ రెయ్యి ప్రీతీష్‌తో పాటు మరికొంత మంది దౌర్జన్యానికి దిగారు. టీడీపీ ఏజెంట్ తో పాటు వారి మద్దతుదారులు పోలింగ్ కేంద్రం వద్ద మహిళా ఓటర్లను బెదిరిస్తున్న నేపథ్యంలో దానికి అడ్డుపడిన వైఎస్సార్‌సీపీ ఏజంట్ భువనేశ్వరిని అసభ్య పదజాలంతో దూషించారు. దీంతో ఆమె స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ గొండేల సుజాత, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు సాయంతో టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, పోలింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. సుంకు డిల్లేశ్వరరావు, సుంకు గోపి, సుంకు శ్యామ్, కొమ్ము హేమంత్, కొమ్ము తరుణ్, కొమ్ము నాయుడు, కొమ్ము నవీన్‌కుమార్, రెయ్యి ప్రీతీష్, పేర మురళీ తదితరులు తనపై దాడి చేసి అసభ్యకరంగా మాట్లాడినట్లు ఫిర్యాదు చేశారు.


టీడీపీ ఏజెంట్ దౌర్జన్యంపై డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న భువనేశ్వరి, సర్పంచ్ సుజాత, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మంజు

ఇతర పార్టీల ఏజెంట్ల ముసుగులో టీడీపీ నేతలు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలో పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లును ప్రభావితం చేయడానికి తెలుగుదేశం పార్టీ నాయకులు ఇతర పార్టీల ఏజెంట్లు అవతారమెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నియోజకవర్గంలో అనేక పోలింగ్ కేంద్రాలను తిరుగుతూ ఓటర్లను ప్రభావితం చేశారు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎక్కడికక్కడ నిలదీసి ఎన్నికల అధికారులకు, పోలీసు ఉన్నత అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లారు. 23వ వార్డు కౌన్సిలర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు భారతచైతన్య యువజన పార్టీ తరఫున అప్పలరాజు మోటూరు అనే అభ్యర్థికి జనరల్ ఏజెంట్‌గా ఉంటూ పోలింగ్ కేంద్రాలను తిరిగారు.


సప్ప నవీన్ విషయంపై ఫిర్యాదు చేస్తున్న పలాస ఎమ్మెల్యే అభ్యర్థి సీదిరి అప్పలరాజు

24వ వార్డు కౌన్సిలర్ సప్ప అమ్మాజీ కుమారుడు, టీడీపీ యువజన నాయకుడు సప్ప నవీన్ సైతం అదే పార్టీకి ఏజెంట్ రిలీవర్ గుర్తింపుకార్డును పట్టుకుని ఓటర్లను ప్రభావితం చేశారు. దీంతో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సీదిరి అప్పలరాజు కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, పలాస ఎన్నికల అధికారి భరత్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లి నాయకులను నిలదీశారు.

జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాం

- డీఐజీ విశాల్ గున్నీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా జరిగిందని, ఎక్కడా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టామని విశాఖపట్నం రేంజి డీఐజీ విశాల్ గున్నీ స్పష్టం చేశారు. సోమవారం జిల్లాలో పలు చోట్ల ఎన్నికల సరళిని ఆయన పరిశీలించిన సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. గతంతో పోల్చితే జిల్లాలో ఈసారి ఎక్కడా ఇబ్బందికర సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ సరళిని అడ్డుకోకుండా పూర్తిస్థాయి బందోబస్తును ఏర్పాటుచేశామని వివరించారు.


శ్రీకాకుళం బాలికోన్నత పాఠశాలలో పోలింగ్‌ను పరిశీలిస్తున్న డీఐజీ విశాల్ గున్నీ

పటిష్ట బందోబస్తుతో నిర్వహణ: ఎస్పీ

పోలీసుతో పాటు కేంద్ర పారామిలిటరీ దళాలు, బలగాలతో బందోబస్తు నిర్వహించడంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎస్పీ రాధిక స్పష్టం చేశారు.

ఎన్నికల్లో మేము సైతం..

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలో సోమ వారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ) క్యాడెట్లు మేము సైతం అంటూ భాగస్వాములయ్యారు. ఎన్నికల్లో సేవలు అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి మేరకు ఎన్‌సీసీ క్యాడెట్లు పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి, పోలీసులకు తమ వంతు సాయాన్ని అందించారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లను క్యూలో పంపించడంతోపాటు పోలింగ్ కేంద్రం లోపల అవసరమైన సాయాన్ని అందించి తమ సేవా గుణాన్ని మరోసారి చాటుకున్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లతోపాటు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లు సైతం ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు.

సిబ్బందికి కలెక్టర్ అభినందనలు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : జిల్లాలో ప్రశాంత ఎన్నికల నిర్వహణలోను, స్వేచ్ఛా శాంతియుత ఓటింగ్‌ను నిర్వహించిన అన్ని శాఖల ఉద్యోగులకు, అన్ని స్థాయిల సిబ్బందికి కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అభినందనలు తెలియజేశారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యాక జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఆయన మాట్లాడుతూ జిల్లాలో సిబ్బంది కలిసికట్టుగా పనిచేసి సజావుగా ఎన్నికల ప్రధాన ఘట్టాన్ని పూర్తిచేశారన్నారు. ఉద్యోగులంతా ఓటింగ్ ప్రక్రియలో నిరంతరాయంగా 14 గంటలకు పైగా పని చేసి విజయవంతం చేశారని ఆయన తెలిపారు.